



కథానిక

"సత్యశ్రీ"

త్రను అసమర్థుడా...?

కాదు.

మరి సమర్థుడా?

ఏమో...! అదీనమ్మకంలేదు!

యింటి అరుగుమీద, కుక్కినవారు మంచం మీద కూర్చొని తర్కించుకుంటున్నాడు వామనరావు.

చెల్లెలు కృష్ణవేణి బుధవారం వెళతానంటుంది. తన బావమరిది ప్రాశాదుకూడా, స్టేషన్‌లో కాచుకు కూర్చుంటాననె. చెల్లెల్ని పంపటాని కిప్పుడేమీ అభ్యంతరంలేదు. అయితే ఒక్కచోటే వచ్చిపడుతోందితంటా...! డబ్బు—డబ్బులేదు. అనిప్పుడు చెల్లెల్ని యింట్లోనుంచి కదపాలంటే దార్జీలకయితే ఏదోవిధంగానైనా వంటూలు పడి యిచ్చుకోవచ్చును. కాని యిప్పుడు దానికి బట్టలు పెట్టాలంటోంది అమ్మ.....! అమ్మకేం చెబుతుంది ఎన్నిమాటలైనా ... ఎన్నట్పాలని చేస్తాడు తను? తనకి సంపాదనంటు ఏదైనా వుండా మళ్ళీ తీర్చటానికైనా? పోనీ తండ్రి సంపాదించిపెట్టిన మూలధనమంటూ ఏమయినా వుందా అంటే అదీ సున్నాయేగా! అదేవుంటే ఇక అప్పులమాటెందుకు తనకు? ఎలాఅయితేనేం మిగిల్చాడు వెధవ రొచ్చుకంపు కొట్టే పల్లెటూళ్లో బోడియిల్లొకటి, మూడెకరాల పొలం ఒకటి...యింతేగా...! పైగా పొలంలో ఒక ఎకరం చెల్లెలికిమ్మంది అమ్మ! ఎలా యిస్తాడు తను...తనకో? తనకు పుట్టబోయే కుర్రాళ్ళకో...! తనిప్పుడు పొలాన్ని పంచిపెట్టేస్తే రేపు ప్రొద్దున్న తనకు కొడుకులు పుట్టినట్లైతే, తను తన తండ్రిని తిట్టుకుంటున్నట్టే వాళ్ళుకూడా తన్ను తిట్టుకోరూ...?

బస్తీనుంచివచ్చిన సర్కస్ ఎడ్వర్‌టైజ్‌మెంట్ కారు కాబోలు, మట్టిరోడ్డుమీద బురదను చిమ్ముకుంటూ యింటిముందునుంచి దూసుకుపోయింది.

వెధవరోడ్లు...! పల్లెటూరి మట్టిరోడ్లకి ఎంత విలువుందో తనకి అంతే; యిటువంటి ప్రదేశాల్లో వుంటే...తనకి విలువేముంది? ... "వెళ్ళేవురా అబ్బాయ్ సుబ్బన్న బాబాయి దగ్గరకి!" అంటూ వామనరావుతల్లి అరుగుమీద కొచ్చింది. తల్లి పిలుపుతో బయటప్రపంచంలో పడ్డాడు. "లేదు-వెళతా...!"

"బుధవారం తప్పకుండా వెళ్ళా లంటోంది అమ్మాయి...!"

వామనరావు సమాధానంచెప్పకుండా లోపలకెళ్లేడు. వెనుక వసారాలో కృష్ణవేణి కత్తిపీటముందేసుకుని దొండకాయలు చక్రాలుగా తరుగుతోంది. "ఈవిడకోసమే నన్నమాట తను అందరి దగ్గరా ప్రాధేయపడాల్సి వస్తోంది...!" అనుకున్నాడు మనస్సులో. తలెత్తకుండా వసారాలోనుంచి వెళ్ళేవాడల్లా కృష్ణవేణి పిలుపుకి ఆగిపోయాడు తక్కున.

"బుధవారమే కద నన్నయ్యా నే వెళ్ళేది..? మరేటువంటిదోక పెడతావో! వాళ్ళకళ్ళు జిగేల్ మనాలి.! మైసూర్ సిల్కులో యిప్పుడు కొత్త డిజైన్స్ వచ్చినయట...!" ముందుకు పడిన వాల్జెడ వెనక్కు వేసుకుంటూ నవ్వుతుంది కృష్ణవేణి "మావోయ్! మరినాకు మూడు చక్రాల సైకిల్.

కొని పెడతానన్నావు...! ఎప్పుడు కొనిస్తావు?" దొండకాయ ముచ్చికలకి చీపురు పుల్లలుగుచ్చి బండిని తయారు చేసుకుంటోన్న "బాబి"గాడు లేచాడు!

వాళ్ళిద్దరికీ సమాధానంగా చిరునవ్వు మాత్రం యిచ్చి, గదిలోకి వెళ్ళి సైకిల్‌ను తీసుకొని బయట కొచ్చేశాడు తల్లి పిలుస్తూన్నా వినిపించుకోకుండా.

రోడ్డంతా బురదగావుంది. సైకిల్ ఎక్కితే చక్రాలు కూరుకుపోతై...అసలు సైకిల్ ఎందుకు తీసినట్టు తను...? తనిప్పుడెక్కడికి వెళ్ళేటట్టు? సుబ్బన్న బాబాయి దగ్గరకా? మొన్నేగా అతని దగ్గర పొలం సాగు చేయించటానికని, ఒక ఎద్దును కొంటానికని అయిదొందలకి నోటురాసి డబ్బు తీసుకున్నది! నెల్లాళ్ళన్నా కాలేదు మళ్ళీ అప్పుకని వెళితే ఏమంటాడో..? యిస్తాడో?..హుళ్ళక్కి చేస్తాడో...! పోనీ రాజుగారి దగ్గరకెళితే...! లాభంలేదు. ఆయనొక్క కానీ అప్పివ్వడు. పైగా, "పిల్లజమీందారువు నీకేమిటోయ్...!" అంటాడు తప్పించుకోటానికి; తనకేదో తండ్రి సంపాదించి పెట్టిన మూలధనమంటూ వుందనుకుంటాడు పాపం ఆయన...ఏదీ..? వుంటే తను అప్పుకోసం ఎందుకు తిరుగుతాడు...?

సైకిలు సుబ్బన్నగారింటిముందుకు రాగానే సందిగ్ధావస్థలో పడ్డాడు వామనరావు. అడుగుదామా? వద్దా? అని. సమయానికి సుబ్బన్నగారే బయటకొచ్చారు మరో ఆసామితో మాట్లాడుకుంటూ.

"ఏలూరుకా బయలుదేరావు...?" అన్నారు వామనరావును చూచి. వామనరావుకి గుండె గొంతుకుపైదాకా వచ్చి గుటక వెయ్యగానే లోపలికి పోయింది.

"ఆఁ...! అవును బాబాయ్...! కొంచెం పనుండి...!" అతనిమాట పూర్తిగాకుండగానే, "సరే! వెళ్ళిరా! తిరిగొచ్చేసరికి ప్రొద్దుపోతుంది గాబోలు...బురదలో సైకిలెందుకుర్రా? అవస్థ కాదూ!.." అనేసి ఆ ఆసామితో కలసి వెళ్ళిపోయారు పుగాకు కాడను విసరివేస్తూ. వామనరావు మరో గుటక వేశాడు. యిటువంటి సమయంలోనే దగ్గర ఆ పెద్దమనిషి వుండాలా..? అసలు తనెక్కడికి బయలుదేరింది? పోనీ ఏలూరు వెళితే...! ఎక్కడన్నా పుట్టించుకోవచ్చునేమో అప్పు! అక్కడైనా ఎవరిస్తారు? స్వంత ఊర్లోనే కష్టంగావున్నప్పుడు? అయినా వెళ్ళి, భాస్కరాన్ని, రామారావుని వాళ్ళని అడిగిచూస్తే? వాళ్ళు కొంచెం డబ్బున్నవాళ్ళేగా! అదీగాక ప్రాణమిత్రులుకూడా ... భాస్కరం ఎన్నిసార్లు సహాయంచేశాడు పాపం.! తనుసైకిల్‌ను ఎలాగూ బయటకు తెచ్చాడు...మళ్ళీయింటికి పోవటం దేనికి? అక్కడా దొరక్కపోతే తిరిగివచ్చేటప్పుడు బాబాయిదగ్గర తీసుకుని వెళ్ళొచ్చుగా.! బురద! దారంతా బురదుంటుందేమో..! ఒక అరమైలు కష్టపడాలి. తరువాత ట్రోడ్డేగా..! సైకిల్‌ను ఏలూరు రోడ్డువైపు తిప్పేడు.

ఊర్లోకి చేరుకోగానే కాలేజీ రోడ్డులో భాస్కరం తారసిల్లేడు. వాడిప్పుడు బి. ఎస్. సి. కాబోలు చదువుతూంటు...తనో...? సెకండియర్ పూర్తిగాకుండానే తండ్రిమరణంతో సంసారాన్ని, యింటిని నెత్తినేసుకుని మోస్తున్నాడు. తనకింకా పెళ్ళికూడా అవలేదు-అప్పుడే సంసార తాపత్రయాలు- అప్పులకి బయలు దేరటాలూను, ఎంతమార్పు..! పలుకరించాడు భాస్కరం.

"అవును! పనేవుండివచ్చాను ... నీతోనే!"

"నాతోటా..? ఏంపని!"

"చెప్తాగా..! నడు!"

వామనరావు భాస్కరం ప్రక్కనే సైకిల్ పట్టుకుని నడుస్తున్నాడు. చక్రాలకి అక్కడక్కడా బురదచినుకులు...ఎవరన్నా తనని చూసి నవ్వుతారేమో..! కులాసాగా నవ్వుతూ కేరింతాలు కొడుతూ మాట్లాడుకుంటూ వెళ్ళే విద్యార్థులలోవున్న వుత్సాహం తనలో లేదు..! ఎలావుంటుంది? తనకీ విద్యకీ సంబంధంలేదు. ఇంతచిన్నవయస్సులోనే పల్లెటూరి పొలాలమధ్య మగ్గిపోతూ, సంసారం, యిల్లు అప్పులు..అప్పుడే వాటిలోవుండే కష్టసుఖాన్ని చవిచూస్తున్నాడు తను..మొదటినుంచీ చదువుమానకుండా కంటిన్యూ చేసినట్టయితే ఎంతబాగుండేది..? అబ్బ! ఎంత తేడా వాళ్ళకీ తనకూ!

వసంతమహల్ దగ్గరకు రాగానే బలవంతంగా లాక్కెళ్ళేడు భాస్కరాన్ని కాఫీ అదీయిప్పించి తరువాత రంగంలోకి దింపుతామనుకున్నాడు.

"ఎన్నా సార్..! మినపట్..దోసె..యిడ్లీ..గారె... గులాబ్..." ఏదోచదువుకు పోతున్నాడు సర్వర్. "రెండు మినపట్ తీసుకురావోయ్... ఒకదాంట్లో పంచదార వెయ్యి! అంతే కదోయ్ భాస్కరం, మళ్ళీ ఈ మధ్యన చెట్నీ గాని మరి గావా?" భాస్కరం, తనుకలసి చదువుకునే రోజుల్లో అతని అలవాట్లన్నీ తనకి గుర్తే. ఒక్కటే మర్చిపోలేదు! సర్వర్ మంచినీళ్ళగ్లాసులు టేబిల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు.

వీడిని ఇప్పుడెంతడగాలి ... మొదటే ఏభై యిమ్మంటే అసలే లేదంటాడేమో..? అందులో సగం..బహుశాయివ్వగలను భాస్కరం! తక్కిన పాతికా ఎక్కడన్నా పుట్టించుకోవచ్చును. అంతకీ దొరక్కపోతే బాబాయి వున్నాడుగా..! అసలు చెల్లెలుకోసం ఏభై అవసరమా..? చీరకి కనీసం పాతికో, ముప్పయ్యో వుండాలి అంతకు తక్కువచీరపెడితే అది ఒప్పుకోదు తనకు తెలుసు. మొదటే "వార్నింగ్" యిచ్చిందిగా..! బావి గాడికి ఓ జత ... బావకి..? బావకిప్పుడెందుకు? యింటికి రాలేదుగా..! యింకేమయినా మిగిత్తే రైలు చార్జీలు.. తలిమావి ఏవయినా మిగిలితే ఏదైనా చేయించి పంపాలి!

సర్వర్ మినపట్లు తెచ్చి టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు.

"అరేభాయ్! నీతో ఒక ముఖ్యావసరంవుండి వచ్చానురా!" అంటూ దింపేసు రంగంలోకి.

"ఏవిటది?"

"మొన్న మా చెల్లెలొచ్చింది కదూ..? ఈ బుధవారం పంపాలనుకుంటూన్నాం! అందుకని నీతో..." పేలవంగా నవ్వాడు వామనరావు. భాస్కరం వెంటనే సంగతంతా గ్రహించి నవ్వేడు!

"అరె! చంపేశావ్..! మా నాన్న ఇంటిదగ్గర లేడోయ్..తాళం చేతులు వెంట తీసుకెళ్ళేడు... లేకపోతే ఏదోవిధంగానైనా సర్దుబాటు చేసి వుండేవాణ్ణి!... అయినా ఎంత అవసరమేం టిప్పుడు?" చివరిమాట విన్నతరువాత పోయిన ప్రాణాలు చేరుకుంటూన్నట్టయినై వామన రావుకు.

"చాలా కావాలనుకో...! ప్రస్తుతానికినువ్వో పాతిక...మళ్ళీ వెంటనే పదిరోజుల్లో తీర్చేస్తా!"

భాస్కరం పెదవి విరిచాడు. "పాతికా! యిప్పుడు-అంటే బుధవారం లోపులో దొరకడం కష్టమే...ఎల్లుండేగా బుధవారం...? శుక్రవారం గాని మా ఫాదర్ రాడు. వచ్చింతరువాతైతే సప్లయి చెయ్యగలను...పాతికే కాదు...ఎంతయినా యిస్తాను... యిప్పటికి ఎక్కడన్నా చూసుకోరా భాయ్...! శుక్రవారం తప్పకుండా రా! యిస్తాను... దానితో అప్పుతెచ్చినచోట బాకీ తీర్చివేసి, ఆ తరువాత నా బాకీమాట ఆలోచించుకోవచ్చును ... నువ్విప్పుడిచ్చినా నాకేం అభ్యంతరం లేదు. ఏమంటావ్...? మా ఫాదరుంటే తప్పకుండా సర్దుబాటు చేసేవాణ్ణే!" పాపం భాస్కరం చాలా ఫీలయ్యాడు. వామనరావు ఏమీ మాట్లాడలేదు. నిరుత్సాహంలో ఒక విధమైన ప్రశాంతత ఏర్పడిందతనిలో.

బయటుకొచ్చేశారు యిద్దరూ. "ఏమీ అనుకోకురాభాయ్...నా సంగతి నీకు తెలుసుగా! శుక్రవారం తప్పకుండా రా ... చూస్తాను!" అన్నాడు భాస్కరం చేతిరుమాలుతో చేతులద్దుకుంటూ. వామనరావు పేలవంగా నవ్వి "సరే! వస్తారా...!" అంటూ సైకిల్ను వెనక్కి తిప్పేడు.

ఇంకెక్కడికి వెళ్ళాలతను...? భాస్కరం దగ్గర తప్పకుండా దొరుకుతుందనుకున్నాడు. పాపం! వాడేం! చేస్తాడు? వాడిఫాద రింటిదగ్గర లేడట...! నిజంగా ఊరెళ్ళి వుంటాడా...? ఛా! అసలు వాడలాంటివాడు కాడే...? ఒక వేళ ఈ మధ్యన తనకూ, వాడికీ సన్నిహిత సంబంధం లేకపోవటంవల్ల మారిపోయాడా...? ఏమో...! ఇప్పుడేం చెయ్యాలి? వెళ్ళిపోవటమేనా తిరిగి? యింకేస్నేహితులనైనా అడిగి చూస్తే...? లాభంలేదు...అడిగి లేదనిపించుకుంటే ఎంత చిన్నతనం...? బాబాయి వున్నాడుగా...!

సాయంత్రం ఆరుగంటలయింది. రోడ్డుమీద 'రష్' ఎక్కువగా వుంది. వచ్చేపోయే జనాన్ని బండ్లనీ తప్పించుకోడం విసుగ్గావుంది. సరిగ్గా కేసరీటాకీస్ దగ్గరకు రాగానే ఏదో గుర్తుకొచ్చి

నట్లయి, సడన్ బ్రేక్ వేసి సైకిల్ దిగి వెనక్కి తిప్పేడు. "సుబ్రహ్మణ్యం"గాడు తనకు బాకీ వున్నాడు...! అడపాదడపా వాడికిచ్చినవి దగ్గర దగ్గర యిరవైరూపాయలన్నా వుంటై. వాడి దగ్గరకెళ్ళి పీకమీదకూర్చుంటే...? యిస్తాడా..? ఏమో...! వాడో ముష్టివెధవ. అడుక్కోవటమేగాని తీర్చటంలేదు. వెళ్ళి "నా బాకీ నాకు యిచ్చెయ్యవోయ్ పుల్లయ్యా"అని సతాయిస్తే! యిస్తాడా? వాడేం యిస్తాడు? ఎన్నిసార్లడిగి "తరువాత"నిపించుకున్నాడు? మొండిఘటం..! మళ్ళీ వాడిదగ్గరకు వెళ్ళటం శుష్కదండగేమో! సైకిల్‌ను మళ్ళీ తనవూరు వైపుకి త్రిప్పిఎక్కేడు. యింకెక్కడా అడగకూడ దనుకున్నాడు.

టౌన్‌లో సైతే లైటులేకుండా పోలీసుల బారి నుండి తప్పించుకున్నాడు గాని, తార్రోడ్డు దాటగానే కలిసే మట్టిరోడ్డును మాత్రం తప్పించుకోలేకపోయాడు. నానా అవస్థలుపడి ఎలా అయితేనేం వూరు పొలిమేరకు చేరుకోనే సరికి తల ప్రాణం తోకదాకా వచ్చి, పొలిమేర హద్దులో వెలిగే లాంతరు స్తంభాన్ని చూడగానే యథాస్థానానికి పోయింది మళ్ళీ. రోడ్లు ఎలా ఏడ్చినా లాంతరు స్తంభాలు వేయించినందుకైనా ప్రభుత్వాన్ని అభినందించాడు వామనరావు.

పొలిమేరదాటి 10, 12 యిళ్లు దాటగానే సుబ్బన్నగారి యిల్లు చేరుకున్నాడు. తన యింటికెళ్ళే దారికూడా అదే. "ఇప్పుడే అడిగేస్తే పోతుందిగా! మళ్ళీ ప్రొద్దున్న ఎవడొస్తాడు?" అనుకున్నాడు. గుమ్మంలో నిలబడే పిలిచాడు. మూడవకేకకిగాని సుబన్నగారి భార్య బయటకు రాలేదు "ఎవరు నాయనా..." అంటూ.

"బాబాయి లేడు పిన్నీ...?"

"ఎవరూ...? వామనరావా...? నువ్వారా నాయనా...? ప్రొద్దుపోయి వచ్చావేం...? రా...! లోపలకి!" అంటూ ఆహ్వానించింది.

"ఎందుకూ కరవాలేదు! బాబాయి వున్నాడా లోపల...?"

"అయ్యో! అరగంట క్రితమే ఏలూరు వెళ్లేరే! ఆయనెవరో వస్తే, ఆయనతో కలసి...! అటు నుంచి జనతాక నిడదవోలు వెళతారట...ఏదో అపరాల బేరంగురించి...!"

"నిడదవోలా...! మళ్ళీ ఎప్పుడొస్తారు?"

"ఏలుంటే అలా రాజమండ్రికి వెళ్ళి చిన్నమ్మాయిని చూసి, శుక్రవారంగాని రానన్నారు!" వామనరావు తెల్లబోయాడు. తనకు దారిలో కనిపించలేదే...? ఒకవేళ పొలాలమీదుగా వెళ్ళేరేమో...ఛీ! తనుకూడా అటే రావలసింది. ఒకవేళ వాళ్ళు మామూలు దోవలో వస్తే...? అసలు వెళతారని తను కలగన్నాడా...? ఈ ఆశకూడా పేలిపోయింది. ఇంకెలా...? వెధవ శుక్రవారాలు ఎందుకు? అవసరం తీర్చని శుక్రవారాలు? దాని ప్రయాణంకూడా శుక్రవారానికి వాయిదావేస్తే? ఏమో...శుక్రవారంకూడా అప్పిచ్చే దాతలు వాయిదా వేస్తే! ఇక అన్ని వాయిదాలమీద వాయిదాలు పెరిగిపోతాయి. లాభంలేదు...మరి డబ్బెలా?

ఇక రోడ్డుమీద క్షణంకూడా నిలబడ బుద్ధి రాలేదు. ఆవిడ యింట్లోకి రమ్మంటున్నా వినిపించుకోకుండా వచ్చేసేడు యింటికి.

ఇంటిగుమ్మం త్రొక్కగానే తల్లి ఎదురైంది. "ఎక్కడికెళ్ళావురా! ఇంతప్రొద్దు పోయిందే?" అంటూ. వామనరావుకి అప్పటివరకూ అణచిపెట్టుకొనివున్న విసుగు, ఉక్కురోషం, ఉడుకుమోత్తనం ఒక్కసారిగా పెల్లుబికి బయటకు వచ్చాయి.

"ఏట్లోకి! చావటానికి!" విసురుగా సైకిల్‌ను పందిరిస్తంభానికి జారవేసి బురద కాళ్ళతోనే లోపల కెళ్ళాడు వడివడిగా. తల్లి విస్తుపోయింది. "ఎందుకురా అంత విసుగు!" అంటూ లోపలికొచ్చేసింది.

వామనరావు తన విసుగు, కోపం తగ్గిన తరువాత తనే తల్లిదగ్గరకువచ్చి తనుపడ్డ పాట్లన్నీ ఏకరువు పెట్టుకొంటూ, "బాబాయి నిడదవోలు వెళ్ళేడట...! శుక్రవారంగానీ రాడట...!" అన్నాడు. కాని వామనరావు తల్లి అంత ఎక్కువగా బాధ పడలేదు. "పోనియ్‌లే! రేపు ఇంకెక్కడన్నా తంటాలు పడొచ్చు!" అంటూ వెళ్ళిపోయింది గదిలోకి.

వామనరావు పక్కమీద పడుకున్నాడుగాని కునుకు పట్టడంలేదు. రేపెక్కడన్నా తంటాలు పడొచ్చునట! అమ్మకెంత ధైర్యం! ఆవిడకేం

తెలుసు తనపాట్లు! తనేగా తంటాలు పడవలసింది...! ఎక్కడ తెస్తాడు తను...? యిక ఏవస్తువు లేకుండా అప్పెలా పుడుతుంది...? బాబాయివుంటే చేతప్పకిందే యిచ్చేవాడు. తనుచాలా పిచ్చిపని చేశాడు...! ఏలూరు వెళ్ళినప్పుడే తలిమా మిత్రులదగ్గర వెతకవలసింది! ఆ సుబ్రమణ్యంగాణ్ని పిలకపట్టుకని బజార్లోకి ఈడ్చి మరీ తనప్పుకోసం దెబ్బలాడవలసింది...! కాని యిలా జరుగుతుందనుకున్నాడా తను? మరెలా యిప్పుడు? పోనీ, కృష్ణవేణికి చార్జీలు మాత్రమే యిచ్చి చీరకీ వాటికి వెనుకనుంచి పంపుతామంటే వూరుకుంటుందా? ఏమో... ఏమనుకుంటుందో... మొఖంచిన్నబుచ్చుకోదూ.. అది ఏమనుకోకపోయినా వాళ్ళ అత్తయ్యా వాళ్ళకు చులకనవదూ? మరెలా...!

అవతలగదిలోనుంచి గోడగడియారం టక్కు-టుక్కు మని లయబద్ధంగా కొడుతూ ప్రశాంతతను భగ్నంచేస్తూన్నా వింటానికి ఆ శబ్దం హాయిగా వుంది! ఆ శబ్దంలో కొంతసేపటివరకూ లీనమై వింటూవుండిపోయాడు. మెఱుపు మెరిసినట్టు అతని బుర్రలోకి ఒక సందేశాన్ని అందజేసింది శబ్దం!

అవును-తనకెందుకీ రిష్టువాచీ...? తనాఫీసు కెళ్ళాలా...? టైంప్రకారం పనిచేసే అవసరమేమైనా వుందా? కావాలంటే యింట్లో గోడగడియారం వుందిగా! యిక్ష్వాకుల నాటిదైనా తప్పు నడవదు! తనవాచీ అమ్మివేస్తే...! మునుపు తను కొన్నది 96 రూ॥లకు. యిప్పటికి మూడుసంవత్సరాలేగా అవుతా... 60 అంటే కళ్ళద్దుకొని తీసుకుంటారు. యిక అప్పుకోసం ఒకరికాళ్లు కట్టుకుని మళ్ళీ తీర్చేటప్పుడు బాధపడాల్సిన పనేమీ వుండదు. అవును-అదేమీ వుండదు. అబ్బ! చెల్లెలు కోసం ఎంత త్యాగం! ఎంతకష్టపడుతున్నాడు తను? తను కష్టపడ్డా దానికితృప్తి, వాళ్ళదగ్గర చిన్నబుచ్చుకోకుండా వుండటమే కావాలి తనకు!

ఈ ఆలోచన తట్టినతరువాత గుండెలమీద చెయ్యివేసుకుని ప్రశాంతంగా నిద్రపోయాడు వామనరావు.

* * *

తెల్లవారి ప్రొద్దున్నే 8 గంటలకు కాఫీ తాగి యింట్లో చెప్పకుండగానే బయలుదేరేడు ఏలూరుకు. తర్జనభర్జనచేసి వాచీని 55 రూపాయలకు అమ్మి, మధ్యాహ్నం 12 గంటలకల్లా యిల్లు చేరుకున్నాడు. ఇల్లు చేరుకోగానే ఉస్సురంటూ కూలబడ్డాడు మంచంలో. తల్లి మంచినీళ్ళగ్లాసుతో బయటుకు వచ్చింది.

"ఏలూరు వెళ్ళేవేంటుబ్బాయ్...? ఒకగంటు ఆగి నాతో చెప్పి వెళితే ఏం పోయింది? పనిలో పని జరిగిపోయేదిగా...!" అంది తల్లి.

"ఏం పని...?"

"ఏముంటుంది! రేపేగా దాని ప్రయాణం. ఇంతదగ్గరలో యిక అప్పెలా పుడుతుంది? అందుకని రత్తమ్మత్తయ్యతో, శేషావతారంగారి దగ్గర నా గాజు లమ్మించి, 80 రూపాయలు తెప్పించాను! అమ్మాయికీ పనికొస్తాయ్. ఇంకేమయినా మిగులుతే యింట్లోకుంటై...!"

వామనరావు నిర్ఘాంతపోయాడు.

"అం! గాజులమ్మేశావా...? నాతో చెప్పకుండా ఎందుకమ్మేవే...!"


"మరెలా వస్తుందనుకున్నావు డబ్బు...? తాకట్టు పెడితేమాత్రం తీర్చుకోవద్దూ మళ్ళీ?"

"సరి—నేను వాచీ అమ్మేసి డబ్బు చేసుకొచ్చాను"

తల్లి నివ్వెరపోయింది.

"బాగుంది. నీ వాచీ ఎందుకమ్మేవురా...! నాతో ఎందుకు చెప్పలేదూ...? అంత తొందర పడ్డావే...?" బిక్కమొగంతో అడిగింది తల్లి.

"మరి నువ్వెందుకు అంత తొందరపడ్డావు?" ఉడుకుమోత్తనంతో వామనరావు ఎదురుప్రశ్న వేశాడు.



ఉరుములూ, మెరుపులూ అసలే లేవు. ఏ దేవతో వచ్చి "అతను రాజాధిరాజై, రాజ్యాలేలతాడని గానీ, నిత్యదరిద్రుడై బొచ్చెఎత్తుకొని బిచ్చమెత్తుకొంటాడనిగానీ చెప్పలేదు!... ఇంతలో ఓ చల్లని హస్తం తనను దగ్గరగా మరింత దగ్గరగా పొదువుకొంటూంటే "ఛా, ఎవరీ మోటుమనిషి" అందామనుకొని నోటికేదో అడ్డంపడగానే తన అభిప్రాయాన్ని మార్చుకొని, మొదటిసారిగా ఆహారం అంటే ఎలా ఉంటుందో రుచి చూశాడా జీవి.

...కళ్ళు తెరిచి యిరవైయొకటో రోజు ఆ జీవి "సంజీవి" (అయ్య) అయ్యాడు.

సంజీవయ్య అలా పెరుగుతూనే ఉన్నాడు, రాజాధిరాజులైనా పీల్చనంత గాలిని పీలుస్తూ, వీరాధివీరులైనా దొర్లనంత దుమ్ములో దొర్లుతూ.. ఆ దుమ్ములో యింకా ఎన్ని రకాలుగా దొర్లాలో ప్రణాళిక తేర్పరచుకొంటూ ఉండగా, ఒకనాడు మాతృదేవత ఓ పాతబడిన పలకా, అర్థచంద్రాకారంలో ఉన్న అరంగుళం బలపమూ యిచ్చి, తీసుకెళ్ళి ఓ బందిఖానాలో విడిచి పెట్టింది! ఆ "జైలు వార్డన్" చేతిలో ఉన్న బెత్తానికి తన వీపుమీద అంత మోజెందుకో ఆలోచించడంతోటే సరిపోయే దతనికి అక్కడున్నంతసేపూ. ఆ బెత్తాన్ని గురించి ఒక నిర్ణయానికి వచ్చేలోగానే ఆ జైలునుంచి బైటపడి బ్రతుకంటే ఏమిటో తెలుసుకోవలసిన అవసరం వచ్చిందతనికి అకస్మాత్తుగా తండ్రి పోవడంతో. అయినా ఆ మాతృమూర్తి గర్వకడేది, ఆ వంశలో సంతకం పెట్టగలవాడు మొదటిసారిగా ఉద్భవించాడు గదా అని.

సంజీవయ్యతండ్రి నడిచిన దారుల్లోనే నడిచి సాయంకాలానికి మానెడుగింజలు తెచ్చేవాడు. ఉప్పూ, మిరపకాయా, ఎక్కడో సంపాదించి తెచ్చేది తల్లి. ఆ రెండు పొట్టలూ పంచుకు తినేవా చాలీచాలని ఆహారాన్ని. నిద్రకి మొహం వాచిపోయాడతను. రాత్రింబగళ్లూ సేవచేయించుకొంటూండేవాడు "పెదకాపు."

అయితే తన పూర్వుల్లాగా జీవితమంతా అలా "గొడ్డుచాకిరి" చేయవలసి అవసరం తప్పిపోయింది సంజీవయ్యకి! అన్నాళ్లు కష్టపడి చదివినచదువు ఊరికే పోతుందా మరి?

1915 లో ఒకరోజు తన జన్మస్థానాన్ని వదలి, తల్లిని వెంటబెట్టుకొని బ్రతుకు తెరువు కోసం వాళ్ళమామగారి ఊరు చేరుకొన్నాడతను.

1916 ఆగస్టు పదవతేదీ అతని జీవితంలోనే కాదు, వాళ్ళ వంశంలోనే ఒక చరిత్రాత్మకదినం! మొదటిసారిగా ఆ వంశస్థుడు గవర్నమెంటు ఉద్యోగస్థుడయ్యాడు!! స్వర్గంలో ఉన్న అతని పూర్వులు పుష్పవర్షం కురిపించుదామనుకొని (అక్కడకూడా డబ్బుకు కొరతేకాబోలు!) మానేశారు. ఆనాడు ఆ మాతృమూర్తి రాల్చిన ఆనందబాష్పాలకు అంతులేదు.

సంజీవయ్య జీవితంలో, "సంతోషం" అత్యున్నత స్థాయినందుకున్నది ఆనాడే!... తనెంతబాగున్నాడు ఆ డ్రస్సులో! నల్లగా తళతళ మెరుస్తూన్న బూటూ, మోకాళ్ళవరకూ మెత్తని మేజోళ్ళూ దానిమీద మడతనలగని, నిక్కరూ, ఎంత చలికైనా అగగల ఆ చొక్కా, తళతళా మెరిసిపోతున్న ఆ గుండీలూ, అన్నిటినీ మించి ఎంత దూరానికైనా 'సంజీవయ్య వస్తున్నాడో'! అని కేకేసి చెప్పే ఆ ఎర్రని ముద్దులొలికే టోపీ, చేతులో లాఠీ...ఓహ్...గంతులేశాడు ప్రేమను చాటుగాపోయి!

సంజీవయ్యకి చిన్నతనంనుంచీ వాళ్ళధర్మయ్య మామకూతురు "సీత"ని చేసుకోవాలని ఉండేది, ఆ అమ్మాయికి సంజీవయ్యంటే చెడ్డసిగ్గు. చిన్నప్పటినుంచీ వాళ్ళిద్దరూ కాబోయే మొగుడూ పెళ్ళామనే అనుకొంటుండేవాళ్ళంతా. కాని సంజీవయ్య పోలీసుద్యోగంలో చేరాదని ధర్మయ్యమామ పిల్లనీయనన్నాడు! అసలు ధర్మయ్యమామ పుర్రెనపుట్టిన బుద్ధికాదది! "ఆ నరసయ్యపంతులే" చేయించాడు. ఆయన కాంగ్రెసులోచేరి యేవేవో గొడవలు చేస్తుంటాడెప్పుడూ. అందువల్ల అతనికి పోలీవావాళ్ళంటేపడదు. యజమానికి తగ్గట్టు ధర్మయ్యమామ ఆ చిలకపలుకులే పలుకుతుంటాడు.

సంజీవయ్య జీవితంలో 'సంతాపం' అత్యున్నత స్థాయి నందుకొన్నది ఆనాడే! 'సీత' పెళ్ళి 'రాజయ్య'తో జరుగుతుంటే, పందిర సంభానికానుకొని నిల్చుండిపోయాడతను.